క్లుప్తంగా...

పాఠశాలను అభివృద్ధి చేస్తాం



వివరాలు నమోదు చేసుకుంటున్న డీఈ, ఏఈ

మణికొండ: మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మనఊరు–మన బడి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే అభివృద్ధి చేస్తామని మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి అన్నారు. బుధవారం ఆమె ఏఈ సాయిమౌనికతో కలిసి పాఠశాలలో చేపట్టాల్సిన పనులను ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో అవసరాలకు తగ్గట్టుగా ప్రతిపాదనలను పంపుతామని మంజూరు కాగానే పనులను చేపడతామన్నారు.

రోడ్లను అభివృద్ధి పరుస్తాం



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లను ఆధునీకరిస్తామని మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కిస్మత్‌పూర్ నుంచి ఎర్రకుంట వెళ్లే రహదారిని అధికారులు, సిబ్బంది, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, డిఈ యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతాలకు జలకళ



నిండుకుండలా మూసీ

రాజేంద్రనగర్: జంట జలాశయాల గేట్లను ఎత్తి వరద నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో మూసీ పరీవాహక ప్రాంతం వరద నీటితో కళకళలాడుతుంది. హిమాయత్‌సాగర్ నాలుగు, గండిపేట్ రెండు గేట్ల వరద నీటితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వరద నీరు సంఘం వద్ద కలిసి మూసీ నిండు కుండలా కనిపిస్తుంది. హైదర్‌గూడ, అత్తాపూర్, నందిముస్లాయిగూడ మీదుగా మూసీ నగరంలోకి ప్రవహిస్తుంది. ప్రస్తుతం వరద నీటితో మూసి చూడముచ్చటగా కనిపిస్తుండడంతో స్థానిక ప్రాంతాలకు చెందిన సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు తీస్తూ సందడి చేస్తున్నారు.

మొహర్రం సంతాప దినాలకు బందోబస్తు కొనసాగించాలి

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని అన్ని ఆషూర్‌ఖానాల వద్ద తగిన బందోబస్తుతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు వినతిపత్రాలు రాశారని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఈ మేరకు పాతబస్తీలోని అన్ని ఆషూర్‌ఖానాల వద్ద బందోబస్తును కొనసాగించాలని కోరుతూ రాసిన లెటర్‌ను బుధవారం తాను దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యకు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన మొహర్రం సంతాప దినాలు 68 రోజుల పాటు కొనసాగుతాయని.. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన పాతబస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో బీబీకా ఆలం సామూహిక ఊరేగింపు కొనసాగుతుందని.. ఇందుకోసం అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీని కోరినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

డబుల్ బెడ్‌రూంలు బీఆర్‌ఎస్ డ్రామా

గోల్కొండ: పేదలకు డబుల్ బెడ్‌రూం ప్రకటనలు బీఆర్‌ఎస్ అభద్రతపు ప్రకటనలలో భాగమని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. కేవలం కొన్నిడబుల్ బెడ్‌రూంలు మాత్రమే అక్కడక్కడ కట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఆయన అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ డ్రామాలు తెలుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిఆర్‌ఎస్‌కు గుణపాఠం నేర్పడం ఖాయమన్నారు.

రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంది

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గండిపేట గేట్లను ఎత్తుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: సకాలంలో అవసరమైన మేరకు వర్షాలు కురిసి రాష్ట్రంలోని అన్ని నదులు చెరువులు నిండి, వాగులు, వంకలు పారుతూ రాష్ట్ర సస్యశ్యామలంగా ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం గండిపేట (ఉస్మాన్‌సాగర్) చెరువు పూర్తి నీటి మట్టం 1790 అడుగులకు గాను 1787.50కి చేరటంతో గంగమ్మకు పూజలు నిర్వహించి రెండు గేట్లను అడుగుమేర తెరచి వెయ్యి క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని హిమాయత్‌సాగర్ ఇప్పటికే పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరటంతో మూడు రోజుల క్రితం గేట్లను తెరిచామన్నారు. ప్రస్తుతం గండిపేట సైతం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుతుందనే అంచనాతో బుధవారం గేట్లను తెరిచామన్నారు. రాత్రి సమయంలో గేట్లను తీస్తే మూసీనది పక్కన ఉండే ప్రజలు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో ఉదయం సమయంలోనే తెరుస్తున్నామన్నారు. బుధవారం రాత్రి, గురువారం భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాలు ఉన్నాయని, అలా కురిస్తే మరిన్ని గేట్లను అధికారులు తెరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్‌డీఓ మల్లయ్య, డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, జలమండలి సీజీఎం దశరథరామిరెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ బి. సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



గండిపేట చెరువుకు పూజలు చేస్తూ..

సమస్యలపై అధికారులు స్పందించాలి

బండ్లగూడ: వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ సీనియర్ నాయకులు శేఖర్‌ముదిరాజ్ వెల్లడించారు. కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు కొండె మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గంధంగూడ గ్రామంలో ఉన్న జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. గంధంగూడలో ప్రజలకు ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. పేదల సమస్యలపై అధికారులను నిలదీస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం సహాయంతో బైరాగిగూడలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితిని పరిశీలించడం జరిగిందన్నారు.అర్హులైన లబ్ధిదారుల సమాచారం సేకరించి వారి దరఖాస్తులతో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, గోపిగౌడ్, నర్సింగ్‌రావు, శంకర్‌రెడ్డి, శివాగౌడ్ పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

రోడ్లకు మరమ్మతులు

రాజేంద్రనగర్: కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాస సేవా సమితి చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పెండ్యాల సాయిమౌలిక వెల్లడించారు. బుధవారం బుద్వేల్ ప్రధాన రహదారిలో వర్షాల కారణంగా ఏర్పడిన గోతులకు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. గోతులమయంగా రోడ్లు మారడంతో ఈ దారి గూండా ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు.



పనులను పరిశీలిస్తున్న సాయిమౌలిక

రోడ్ల, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వినతి

గచ్చిబౌలి: ఓల్డ్ ముంబై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న డైమండ్‌హిల్స్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌కు డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. డైమండ్‌హిల్స్ లేఅవుట్‌లోని 60, 40 అడుగుల రోడ్లను యు ఆకారంలో అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కల్గుతుందన్నారు. పార్క్ స్థలం కబ్జాకు గురి కాకుండా అభివృద్ధి చేయాలని వారు కోరారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ చేయాలని లేదా షరతులతో నిర్మాణాలకు అనుమతి ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.దీనిపై కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కైలాష్‌నగర్ వద్ద చేపట్టనున్న కల్వర్ట్ , మంజీరా పైప్‌లైన్ తరలింపు పనుల గురించి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించాలన్నారు. జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, ఈఈ శ్రీకాంతి, డీఈ దుర్గ ప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, మేనేజర్ సుబ్రహ్మణ్యం, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, అక్బర్ ఖాన్, సందీప్‌రెడ్డి, నరేందర్ బిల్లా పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హర్షం

రాయదుర్గం: ఉన్నత విద్యాసంస్థల్లో బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడం ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) విజయమని ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బుధవారం ఏఐఓబీసీఎస్ఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో బీసీ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు సమస్యలపై వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీల్లో, పలు సంస్థల్లో సీట్లు పొందిన బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రకటించడాన్ని ఏఐఓబీసీఎస్ఏ స్వాగతిస్తుందన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి వినోద్‌కుమార్, బీసీ శాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం చొరవ తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ కార్యదర్శి సాయికిరణ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్, నాయకులు వెంకట్‌దాస్ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులను ప్రారంభిస్తాం

మణికొండ: అలకాపూర్ చింత చెట్టు చౌరస్తా నుంచి అలిజాపూర్ వరకున్న రోడ్డును 80 అడుగుల వెడల్పుతో నిర్మాణం చేసే పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ అన్నారు. బుధవారం హెచ్‌ఆర్‌డీసీఎల్ ఎస్‌ఈ, హెచ్‌ఎండీ ప్లానింగ్ డీఈలతో కలిసి ఆయన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి (గురువారం) నుంచి రోడ్డు మధ్యలో మార్కింగ్ వేసే పనులు మొదలవుతాయని, అవి పూర్తి కాగానే మరోసారి గతంలో వేసిన మార్కింగ్‌లను సరిచూసుకుని పనులను సాధ్యమైనంత త్వరలో ప్రారంభిస్తారన్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో త్వరగా పనులు చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న అధికారుల బృందం



ఎంటేరువాగుపై నుంచి ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శంషాబాద్ రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో వాగు, వరద ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సుల్తాన్‌పల్లి–కేబీ దొడ్డి మధ్యలో పారుతున్న ఎంటేరువాగును పరిశీలించారు. ఇక్కడ కల్వర్టుపై నుంచి వరద పారుతుండడం..కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో రోడ్డును మూసేశారు. జనం ఇటువైపు రాకపోకలు సాగించేందుకు జాగ్రత్త పడాలని సూచించారు. కేబీ దొడ్డి వద్ద ఈసీ వాగును పరిశీలించారు. జనం శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని, లోతట్టు ప్రాంతాలకు దూరంగా వెళ్లాలన్నారు. చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్, సర్పంచు దండు ఇస్తారి, వార్డు సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వర్షంలో బయటకు రావద్దు..

మణికొండ: బుధవారం రాత్రి నుంచి 48 గంటల పాటు భారీ నుంచి అతిభారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని మణికొండ, నార్సింగి మున్సిపల్ కమిషనర్లు కె.ఫల్గుణ్‌కుమార్, బి.సురేందర్‌రెడ్డి కోరారు. రోడ్లపై మ్యాన్‌హోళ్లు తెరచి ఉంటాయని, విద్యుత్ స్తంభాల ద్వారా రోడ్లపైన ఉండే నీటిలోకి సరఫరా అయ్యే అవకాశం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరమైతే మణికొండ టోల్ ఫ్రీ **18005997575** నార్సింగి **9121531904** నంబర్లను సంప్రదించాలన్నారు.

నల్లగండ్లలో జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం

నల్లగండ్లలో అపార్టుమెంట్ల సామర్థ్య పరీక్షలు



అపార్టుమెంట్ సామర్థ్య పరీక్ష చేస్తున్న జెఎన్‌టీయూ టెక్నికల్ అధికారులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్ పక్కనే ఉన్న అపార్టుమెంట్ల సామర్థ్యాన్ని జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం బుధవారం పరిశీలించింది. సెల్లార్ పక్కనే ఉన్న శ్రావ్యాస్, ఆపిల్ అపార్టుమెంట్ల ప్రహరీలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆయా అపార్టుమెంట్ల ఏరియా, వాటిలో ఎన్ని ఫ్లాట్లు ఉన్నాయి, ఎన్ని అంతస్తులు నమోదు చేసుకోవడంతో పాటు అపార్టుమెంట్ల పిల్లర్లు, బీములను పరిశీలించారు.కాగా నల్లగండ్లలో తవ్విన సెల్లార్ మూలంగా అపార్టుమెంట్ల ప్రహరీలు కూలాయి. దీంతో వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్‌లో అపార్టుమెంట్ల పక్కన పెద్ద ఎత్తున మట్టి నింపుతోంది. సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టింది.

లోతట్టు ప్రాంతాల్లో ఎంఐఎం నాయకుల పర్యటన

రాజేంద్రనగర్: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ సూచించారు. బుధవారం మహమూద్‌నగర్, హసన్‌నగర్, బాబానగర్ తదితర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ టి.వెంకన్న, నరేందర్‌బాబు, జలమండలి అధికారులు ఈశ్వర్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మిర్జా రహమత్‌బేగ్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చి చేరుతున్నాయని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ వెంట వార్డు సభ్యులు మహబూబ్, మహ్మద్ జహంగీర్, ఇక్బాల్‌ఖాన్, మహ్మద్ అస్లాం, సయ్యద్ జావిద్ ఉన్నారు.



హసన్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్

మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి



నిరసనలో పాల్గొన్న క్రైస్తవ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ క్రైస్తవ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలకు నిరసనగా బుధవారం ర్యాలీ చేపట్టారు. బుద్వేల్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఆవరణలో ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, కుల సంఘాల ప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. సంఘటనకు బాధ్యత వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. హింసకు గురై పునరావాస కేంద్రాల్లో తల దాచుకుంటున్న వాళ్లకి భద్రత కల్పించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. బేటీ బచావో– బేటి పడావో అని చెబుతున్న ప్రధాన మంత్రి మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే 79 రోజుల తర్వాత కూడా నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. 15 రోజులకు ఒకసారి దేశ ప్రజలతో మన్‌కీబాత్ పేరుతో మాట్లాడుతున్న ప్రధాని మణిపూర్ హింసపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఓటు అనే ఆయుధంతో హింసకు పాల్పడుతున్న, ప్రేరేపిస్తున్న వారికి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ కె.నతానియెల్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ కె.సుందర్పాల్, నాయకులు జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, గుంటి రాజ్‌కుమార్, సదాలక్ష్మి, నరేందర్ క్రైస్తవ సంఘాల పెద్దలు రెవరెండ్ డాక్టర్ విజయ్‌భూషణం, రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మల్లా, రెవరెండ్ సి.హెచ్.జాన్‌మోజెస్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయాలి

రాజేంద్రనగర్: శిథిలావస్థకు చేరిన ఇళ్లను ప్రజలు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుద్వేల్ భగవతిగూడలో వర్షాలకు కూలిన పాత ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. కూలిన ఇంటిలోని వృద్ధురాలు, కుటుంబ సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ నివసించరాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, సాయి, పవన్‌సాయి, చత్రజ్ఞా, సందీప్‌యాదవ్, మహేష్, శ్రీకాంత్, జగదీష్, పాండుయాదవ్ పాల్గొన్నారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఎన్నికల కోడ్ లోపు అభివృద్ధి పనులు పూర్తి కావాలి

మణికొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోడ్‌లోపు ప్రస్తుతం చేసిన తీర్మాణాల అభివృద్ధి పనులు టెండర్, పనులు కొనసాగటం పూర్తి కావాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ డి.రేఖయాదగిరి ఆదేశించారు. బుధవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు రూ.కోటి చొప్పున కౌన్సిలర్లు కోరిన పనులను చేపట్టాలని తీర్మాణించారు. వాటితో కలిపి సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.19.90 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.5.90 కోట్లు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలకు రూ.11.50 కోట్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి రూ. 2.20 కోట్లు, జంక్షన్‌ల అభివృద్ధి, గ్రీనరీ పెంపొందించేందుకు రూ. 2.10 కోట్లు, వాహనాల కొనుగోలుకు రూ. 70 లక్షలు, ఇతర ఖర్చులకు రూ. 50 లక్షలతో మొత్తం రూ.42.80కోట్లను ఖర్చు చేయాలని తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు తమ వార్డులలో విద్యుత్ స్తంభాలను మార్చటం, నీటి సౌకర్యానికి పైప్‌లైన్లను వేయాల్సిన అవసరం ఉందని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ నాగరాజు, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, డీఈ నరసింహారాజు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో సమస్యలు తెలుపుతున్న కౌన్సిలర్ ఉషారాణి



ఈవీఎంలను పరిశీలిస్తున్న నాయకులు

ఈవీఎంలపై అవగాహన

మణికొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఉపయోగించనున్న ఈవీఎంలపై ప్రజాప్రతినిధులు, ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వాటిని ఏర్పాటు చేసి ఓటింగ్‌పై అవగాహన వాటి పనితీరును వివరించారు. మణికొండలో జరిగిన అవగాహన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు బి. శ్రీరాములు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కిసాన్ సమృద్ధి కేంద్రాలు

శంషాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర సర్కారు ఎరువుల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతోందని కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. మహిపాల్‌రెడ్డి అన్నారు. రాజస్థాన్‌లోని సికిర్‌లో ఈ నెల 27 ఉదయం 10 గంలకు కిసాన్ సమృద్ధి కేంద్రాలను భారత ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని ఐదు కిసాన్ సమృద్ధి కేంద్రాలు (ఫర్టిలైజర్స్) దుకాణాల వద్ద రైతుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇకపై రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువులు, మందుల పైన లభించే సబ్సిడీలను ఆయా కేంద్రాల నిర్వాహకులు వెల్లడిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, దేవేందర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

గోమాత.. మృత్యువాత

మేత కోసం వెళ్లిన ఆవులకు కరెంటు షాక్ తగిలి మృత్యువాత పడ్డాయి. రామంజాపూర్ వాసి రైతు ఇస్తారికి చెందిన రెండు ఆవులు బుధవారం మేత కోసం వెళ్లాయి. అక్కడ విద్యుత్ తీగలు తెగి పొలంలో పడ్డాయి. అటుగా వెళ్లిన ఆవులకు కరెంటు షాక్ తగిలి చనిపోయాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తీగలను సరి చేయలేదని, ఇప్పుడు ఆవులు చనిపోయినా స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.లక్ష విలువ చేసే ఆవులు చనిపోవడంతో పాడిరైతు ఇస్తారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ క్రాంతికుమార్ అన్నారు. –శంషాబాద్ రూరల్

